క్లుప్తంగా

రైతులకు అందుబాటులో సొసైటీ సేవలు



సభలో మాట్లాడుతున్న చైర్మన్ ఆకుల సత్యనారాయణ

మలికిపురం: గ్రామాల్లో రైతులకు అన్ని విధాలుగా సహకార సంఘం అందుబాటులో ఉంటుందని కేశనపల్లి సహకార సంఘ చైర్మన్ ఆకుల సత్యనారాయణ అన్నారు. మండలంలోని కేశనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మహాజన సభ సమావేశం చైర్మన్ అధ్యక్షతన జరిగింది. సభలో ఆయన మాట్లాడుతూ, సహకార వ్యవస్థ ద్వారానే రైతాంగం అభివృద్ధి ముడిపడి ఉందన్నారు. అనంతరం సొసైటీ జమా ఖర్చులతో పాటు ఆదాయ వ్యయాలను, లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్ రుణాల వివరాలను సభ ముందు ఉంచి ఆమోదం పొందారు. కార్యక్రమానికి డైరెక్టర్లు అడబాల మూలాస్వామి, దొంగ నాగేశ్వర రావు, కేశనపల్లి, పడమటిపాలెం సర్పంచ్‌లు యెనుముల నాగు, ఆకుల నాగలక్ష్మి, చిన వెంకనాయుడు, ఎంపీటీసీ రాపాక సత్యనారాయణ, రైతులు, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ మృతి పార్టీకి తీరని లోటు



రామకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు

మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, అప్పనపల్లి బాల బాలాజీ దేవస్థానం మాజీ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ మృతి పార్టీకి తీరని లోటని పి.గన్నవరం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు శ్లాఘించారు. రామకృష్ణ సంతాప సభ నగరంలో ఆదివారం జరిగింది. రామకృష్ణ పార్టీకి చేసిన సేవలను ఆయన కొనియాడారు. చైర్మన్‌గా ఆటు భక్తులు, రైతులకు సేవ చేయడంతో పాటు వైఎస్సార్ సీపీకి సేవలందించారని పేర్కొన్నారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. రామకృష్ణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో కుసుమ శ్రీధర్, కడలి శ్రీనివాస్, జక్కంపూడి వాసు, నెల్లి దుర్గాప్రసాద్, గుబ్బల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ హల్‌చల్



కొండచిలువను చంపిన రైతులు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో ఆదివారం కొండచిలువ హల్‌చల్ చేసింది. స్థానిక గౌడ వీధిలో పాడి రైతు వాకా వెంకటేశ్వరరావు తన పొలంలో పశువులకు గడ్డి కోస్తుండగా సుమారు పది అడుగుల పొడవైన కొండచిలువ కంటబడింది. దీంతో అప్రమత్తమైన అతను తన ప్రాణ రక్షణ కోసం స్థానికుల సాయంతో కొండచిలువను వధించారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వర్షా కాలం దృష్ట్యా ఇటీవల కాలంలో పొలాల్లో విష సర్పాలు అధికంగా ఉంటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉద్యోగ సంఘ కార్యవర్గం ఎన్నిక



నూతన రాజోలు సమితి యూనిట్ కార్యవర్గం

రాజోలు: మండల సమితి యూనిట్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా నిర్వహించారు. ఎన్నికల అధికారి పీవీఎస్ భాస్కర రావు ఆధ్వర్యంలో రాజోలు మండల పరిషత్ సమావేశ హాలులో జరిగిన ఎన్నికల్లో రాజోలు సమితి యూనిట్ అధ్యక్షుడిగా మామిడిశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, కార్యదర్శిగా రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జి.ప్రవీణ, సంయుక్త కార్యదర్శిగా భరత్, కోశాధికారిగా చక్రవర్తి, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా శ్రీకాంత్, రాధాకృష్ణలు ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, మలికిపురం, సఖినేటిపల్లి మండల పరిషత్ ఏఓలు జి.మిల్టన్, సోమేశ్వరి పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి సాయం

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న ఐదేళ్ల చిన్నారి వైద్యానికి కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లాకి చెందిన సహశ్రీ (5) పుట్టుకతోనే తలసేమియాతో బాధపడుతుండటంతో ప్రతీ నెల రెండు సార్లు రక్తం ఎక్కిస్తున్నారు. ప్రస్తుతం బెంగుళూరు ప్రైవేట్ హాస్పిటల్‌లో బోన్ మారో ట్రాన్స్ ప్లాంటేషన్‌కు రూ.10 లక్షలు అవుతుందని డాక్టర్లు తెలిపారు. చిన్నారి తండ్రికి ఆర్థిక స్తోమత లేక సేవా సంస్థ సభ్యులను సాయం కోరగా.. పాప చిన్నాన్న సూర్యప్రకాష్‌కు చెక్కును అందజేశారు.

ఆడబిడ్డలకు సర్కార్ టోకరా..!

- సూపర్ సిక్స్‌లో అమలుకు నోచుకోని మరో పథకం
- ఆడబిడ్డ నిధిపై ఊసెత్తని ప్రభుత్వ పెద్దలు
- బాబు హామీలతో మోసపోయామంటున్న మహిళలు



'ఆడబిడ్డ నిధి' ఎప్పుడిస్తావ్ బాబూ!

కొత్తపేట: ప్రజలను నమ్మించి మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య..అధికారం కైవసమే లక్ష్యంగా ఎన్నికల ముందు ఎక్కడ లేని హామీలు ఇవ్వడం.. తీరా అధికారం చేపట్టిన తరువాత ఇచ్చిన హామీలను గాలికొదిలేయడం ఆయనకు మామూలే.. మనమే గుడ్డిగా నమ్మి మోసపోయాం అంటూ మహిళలు వాపోతున్నారు. సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అంటూ అనంతపురంలో అట్టహాసంగా విజయోత్సవం నిర్వహించారు. నేతలంతా ప్రసంగాలతో ఊదరగొట్టారు. సూపర్ సిక్స్‌లో అమలుకు నోచుకోని మరో పథకం ఆడబిడ్డ నిధి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర కావస్తున్నా.. కూటమి పెద్దలు ఆ పథకం గురించి ఎక్కడా ఊసెత్తడంలేదు. దానితో ఆ పథకం ఎప్పుడు అమలు చేస్తారంటూ మహిళలు ప్రశ్నిస్తున్నారు.

పథకం అమలు ఎప్పుడు?

2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు తనను ప్రజలు నమ్మడం లేదని గ్రహించి.. తాను మారిన మనిషినని.. సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తానని విస్తృతంగా ప్రచారం చేశారు. అలా కూటమి నేతలు ప్రచారం చేసిన సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఆడబిడ్డ నిధి పథకం అమలుపై ఇప్పుడు మహిళలందరిలోనూ అయోమయం నెలకొంది. తాము అధికారంలోకి వస్తే 18 నుంచి 59 ఏళ్ల మహిళలందరికీ నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు, ఇంట్లో ఎంత మంది ఉంటే అందరికీ వర్తింప జేస్తామని కూటమి నేతలు ఊరూవాడా ఊదరగొట్టారు. గెలిచిన తరువాత వారి బుద్ధి మరోసారి చూపించి మహిళలకు మళ్లీ శఠగోపం పెట్టారు. 2014 ఎన్నికలకు ముందు కూడా డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని మోసం చేయగా.. ఈసారి ఆడబిడ్డ నిధి పథకం పేరుతో మోసం చేశారు.

నోటికొచ్చిన హామీలు ఇచ్చి..

పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో సుమారు 2.70 లక్షల మంది ఈ పథకానికి అర్హులున్నారు. ప్రతి నెల రూ.1500 ప్రకారం రూ 40.50 కోట్లు చెల్లించాలి. అధికారం చేపట్టి ఏడాదిన్నర కావస్తున్నా పథకం ఊసే లేదు. నమ్మి ఓట్లేసిన వారికి మరోసారి టోపీ పెట్టేందుకు చూస్తున్నారని మహిళలు మండిపడుతున్నారు. పథకం అమలు చేయాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మాలని ఓ మంత్రి మాట్లాడడంపై మహిళలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చేందుకు నోటికొచ్చిన హామీలు ఇచ్చినప్పుడు ఆ సంగతి తెలియదా అని వారు ప్రశ్నిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో మహిళలకు పెద్దపీట

గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందేవి. అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందేవారు. మహిళలకు ఆర్థిక చేయూత అందించేందుకు అప్పటి ప్రభుత్వం వారి ఖాతాల్లోనే నేరుగా డబ్బులు జమ చేసింది. అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత వంటి పథకాల సొమ్మును మహిళల ఖాతాల్లో జమ చేసింది. కూటమి సర్కార్ వచ్చి ఏడాదిన్నర పూర్తవుతున్నా.. ఆడబిడ్డ నిధి అమలుకు నోచుకోలేదు. ఈ పరిస్థితుల్లో అమలు చేయాలంటే ఆంధ్రాను అమ్మాల్సిందేనంటూ మంత్రి అచ్చెన్నాయుడు ఓ సందర్భంలో చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా దుమారం రేపాయి. మహిళల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దసరాకు పథకంపై ప్రకటన చేస్తారని అక్కచెల్లెమ్మలు ఆశగా ఎదురుచూశారు. అయిన ప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంపై వారి ఆశలు నీరుకారాయి. ఎప్పుడు అమలు చేస్తారో తెలియక అయోమయంలో ఉన్నారు. అసలు అమలు చేస్తారా? అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే ఆ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

విశ్వసనీయత నిరూపించుకోవాలి



మహిళలను మోసం చేయడం చంద్రబాబుకు పరిపాటిగా మారింది. ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 ఇస్తామన్నారు. ఏడాదిన్నర కావస్తున్నా ఇంతవరకు పథకాన్ని అమలు చేయలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీ తూచా తప్పకుండా అమలు చేశారు. దానిలో భాగంగా వైఎస్సార్ చేయూత కింద రూ.18,750 చొప్పున ఇచ్చారు. కూటమి పెద్దలు ఇచ్చిన మాట ప్రకారం ఆడబిడ్డ నిధి అమలు చేసి మహిళలను ఆర్థికంగా ఆదుకోవాలి. ఇచ్చిన హామీలు చేతల్లో చూపి విశ్వసనీయత నిరూపించుకోవాలి.

– గూడపాటి రమాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు, కొత్తపేట.

ఓట్లేయించుకొని మోసం చేశారు



అధికారంలోకి రాగానే ఆడబిడ్డ నిధి పథకం అమలు చేస్తామని ఎన్నికల ముందు ఊరూరా ప్రచారం చేశారు. బాండులు ఇచ్చి మాది హామీ అన్నారు. ఏడాదిన్నర కావస్తున్నా ఈ పథకం అమలుకు అతీగతీ లేదు. అధికారంలోకి రాకముందు ఒకలా, వచ్చాక మరోలా వ్యవహరిస్తున్నారు. డ్వాక్రా రుణాలు మాఫీ అని గతంలో ఓట్లేయించుకుని మోసం చేశారు. ఇప్పుడు ఆడబిడ్డ పేరుతో మరోసారి మోసం చేస్తున్నారు.

– కుర్రా లక్ష్మి, డ్వాక్రా మహిళ, కొత్తపేట

కవి సమ్మేళనంలో చంద్రశేఖర్‌కు సత్కారం

రాజోలు: భారత ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు పక్షోత్సవాల్లో భాగంగా పొన్నమండ గ్రామానికి చెందిన కవి గంటి చంద్రశేఖర్‌ను సత్కరించారు. ఆదివారం అమలాపురంలోని కిమ్స్ ఆస్పత్రి ఆడిటోరియంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగిందని చంద్రశేఖర్ వివరించారు. కవి సమ్మేళనంలో కవితాగానం చేసిన చంద్రశేఖర్‌ను రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌లు సత్కరించారు. నాయకులు అయ్యల భాస్కర రాయుడు, యాళ్ల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

అయినవిల్లి: ప్రసిద్ధగాంచిన విఘ్నేశ్వర స్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి అమలాపురానికి చెందిన జానపాటి వర్షిత దేవి ఆదివారం రూ.10,116లు అందజేశారు. ఈ సొమ్మును ఈఓ ముదునూరి సత్యనారాయణరాజుకు అందజేశారు. దాతను వేదపండితులు సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

8, 9 తేదీల్లో సర్వసభ్య సమావేశాలు

రాజోలు: ఏపీ ఎన్జీఓ సంఘ సర్వసభ్య సమావేశాలు అక్టోబర్ 8, 9 తేదీల్లో రాజమండ్రి, అమలాపురంలో జరుగుతాయని రాజోలు తాలూకా అధ్యక్షుడు డి.సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. ఈ మేరకు 29న రాజోలులో జరిగే ఎన్జీఓ సంఘ సమావేశానికి నాలుగు మండలాలకు చెందిన సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్జీఓ అత్యవసర సమావేశం కాకినాడ ఎన్జీఓ హాలులో జరుగుతుందని, ఆ సమావేశంలో జిల్లాకు అడ హక్ కమిటీ ఏర్పాటు చేస్తారన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, కార్యదర్శి డి.వి.రమణ ఆధ్వర్యంలో వచ్చే నెల 9న అమలాపురంలో ర్యాలీ, సమావేశం జరుగుతాయన్నారు.

ముంపులో అప్పనపల్లి కాజ్‌వే



అప్పనపల్లి కాజ్‌వేపై వరద నీటిలో ప్రయాణికుల ఇబ్బందులు



ముక్తేశ్వరం- అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వేపై వరదనీరు

మామిడికుదురు: గోదావరి వరద లంక గ్రామాలను వీడేలా లేదు. రెండు నెలల వ్యవధిలో మూడో సారి అప్పనపల్లి కాజ్‌వే ఆదివారం ముంపు బారిన పడింది. దీంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాజ్‌వేపై రెండడుగులు దాటి వరద నీరు ప్రవహిస్తోంది. వరద నీటిలో అష్టకష్టాలు పడుతూ భయం భయంగా కాజ్‌వే దాటారు. అప్పనపల్లి ఆలయ స్నాన ఘట్టం పూర్తిగా ముంపులో చిక్కుకుంది. దీంతో పాటు పెదపట్నం, అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల్లోని కూరగాయల తోటలు, కొబ్బరి తోటలు, పసుగ్రాసం ముంపు బారిన పడ్డాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తమకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మరోసారి వరద ఉధృతి

అయినవిల్లి: వరద ఉధృతికి మండలంలోని ముక్తేశ్వరం- అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వే ఆదివారం ముంపునకు గురైంది. దీంతో లంక గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పడవలపై ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్నారు. రెవెన్యూ అధికారులు వరద ప్రభావిత ప్రాంతాలైన అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, అద్దంకివారిలంక గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ముక్తేశ్వరం వృద్ధగౌతమి పాయలో వరద ఉధృతి కొనసాగుతోంది. పాత వంతెనపై వరదనీరు ఐదు అడుగులు దాటి ప్రవహిస్తుంది.

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని వశిష్ట, వైనతేయ, గౌతమీ నదీపాయల్లో వరద ఉధృతి అంతకంతకూ పెరుగుతోంది. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెల వారి పేట, బూరుగులంక ప్రజలతో పాటు, జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, సిర్రావారిలంక, ఆనర్లంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు రెండున్నర నెలలుగా పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ఏడాది వరదలు తగ్గకుండా కొనసాగుతుండటంతో లంక ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

జాషువా సాహిత్యంతో సామాజిక చైతన్యం



గుర్రం జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రాజోలు: నవయుగ చక్రవర్తి, కవి సార్వభౌమ మహాకవి గుర్రం జాషువా సాహిత్యం సామాజిక చైతన్యానికి మార్గదర్శిగా నిలిచిందని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం రాజోలు అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో గుర్రం జాషువా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి దళిత చైతన్య వేదిక నాయకుడు మట్టా సురేష్‌కుమార్ అధ్యక్షతన పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు జిల్లెళ్ల రాజబాబు, కవి మోకా రత్నరాజులు మాట్లాడుతూ, జాషువా రచించిన కావ్యాలను వివరించారు. బొమ్మారెడ్డి ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత పీతల రాజశేఖర్, ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొంబత్తుల సురేంద్రకుమార్, కవి మోకా రత్నరాజులకు అంబేడ్కర్ చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. దళిత చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు చిలకపాటి శ్రీధర్, రాష్ట్ర కో–ఆర్డినేటర్ చింతా శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు లిఖితపూడి బుజ్జి, మండల అధ్యక్షుడు మందపాటి మధు తదతరులు పాల్గొన్నారు.

శక్తి స్వరూపిణి.. సుమధుర హాసిని



జి.పెదపూడిలో కాత్యాయనీ అలంకరణలో వైష్ణవి కనకదుర్గమ్మ

మామిడికుదురు: శక్తి స్వరూపిణిగా కొలువైన ఆ కనకదుర్గమ్మను భక్తులు భక్తిశ్రద్ధలతో కొలిచారు. శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా 7వ రోజు ఆదివారం అప్పనపల్లి బాలబాలాజీ స్వామి సన్నిధిలో శ్రీమహాలక్ష్మి అమ్మవారు ఐశ్వర్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మామిడికుదురులో కొలువైన విజయదుర్గమ్మకు గులాబి పూలతో విశేష అర్చన జరిపించారు. పాశర్లపూడి బాడవ కనకదుర్గమ్మ మహాచండి అలంకరణలో దర్శనమిచ్చారు, పెదపట్నంలంకలో కనకదుర్గమ్మ కాళరాత్రి అలంకరణలో భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు.

మహాచండీగా విజయ కనకదుర్గాదేవి

కొత్తపేట: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవార్లు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక బొరుసువారి సావరం విజయకనకదుర్గాదేవి అమ్మవారిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు మహాచండీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గ్రామ దేవత బంగారమ్మ అమ్మవారిని, ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత వాసవీకన్యకాపరమేశ్వరీని ఆయా ఆలయ కమిటీలు ఆధ్వర్యంలో అర్చకులు వివిధ అవతారాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాడపాలెంలో ఉన్న జ్ఞానసరస్వతీ దేవికి, బోడిపాలం మండలంలోని గ్రామాల్లో ఉన్న అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సరస్వతీదేవిగా కన్యకా పరమేశ్వరి

అంబాజీపేట: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక బస్‌స్టేషన్ వద్ద ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు ఆదివారం సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు చంద్రమౌళి సుబ్రహ్మణ్య శర్మ బ్రహ్మత్వంలో చంద్రమౌళి ధనుష్, కామేష్ శర్మల ఆధ్వర్యంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. మాచవరం శివారు కోఠి వారి అగ్రహారంలో ఉన్న భువనేశ్వరి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మాచవరం శివాలయం వద్ద ఉన్న వారాహి అమ్మవారిని గాజులతో అలంకరించారు.

వైభవంగా చండీహోమం

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో ఆదివారం వైభవంగా చండీహోమం నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించిన ఈ చండీ హోమాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. దుర్గాదేవి అమ్మవారు చండీమాత రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పి.గన్నవరం: నవరాత్ర మహోత్సవాలు, స్వర్గీయ మిర్తిపాటి నారాయణ జయంతి సందర్భంగా ఆదివారం లంకల గన్నవరంలోని రుక్మిణి సత్యభామా సమేత రాజగోపాలస్వామి ఆలయం వద్ద ప్రముఖ జ్యోతిష్యవేత్త దువ్వూరి సత్యనారాయణ శర్మ భక్తులకు జ్యోతిష్య ప్రాసస్త్యం వివరించారు. ప్రముఖ కవి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తెన్నేటి వెంకట లక్ష్మి నర్సింహమూర్తి సుందర కాండ అనే ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, మాజీ ఎంపీపీ త్సల్లా బిందు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: ముక్తేశ్వరంలో క్షణముక్తేశ్వర స్వామి ఆలయంలో కొలువైన ముక్తికాంతమ్మకు ఆదివారం సామూహిక కుంకుమ పూజలు చేశారు. అలాగే విలస, సిరిపల్లి, తొత్తరమూడి, నేదునూరు, పోతుకుర్రు, క్రాప, మూగం తదితర గ్రామాల్లో అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.


పి.గన్నవరం: మండలంలోని జి.పెదపూడిలో ఉన్న శ్రీవైష్ణవి కనకదుర్గమ్మ ఆదివారం కాత్యాయనీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే తాటికాయలవారిపాలెంలోని కనకదుర్గమ్మ మహాచండీ దేవి అవతారంలో కనువిందు చేశారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

నేడు సరస్వతీ పూజ

తాటికాయలవారిపాలెం కనకదుర్గమ్మ ఆలయం వద్ద సోమవారం ఉదయం విద్యార్థులచే పెద్ద ఎత్తున సరస్వతీ దేవి వ్రతాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



ఐశ్వర్యలక్ష్మిగా అప్పనపల్లి మహాలక్ష్మి అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో కొత్తపేట బి.సావరం విజయ కనకదుర్గాదేవి

రాష్ట్ర అభివృద్ధిపై శ్రద్ధ పెట్టండి

- మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు
- డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ



అంతర్వేదిలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న గొల్లపల్లి సూర్యారావు, పాపారాయుడు

మలికిపురం: కూటమి నేతలు ప్రతిపక్ష పార్టీలపై వేధింపులు మాని ఆ విలువైన సమయాన్ని రాష్ట్ర అభివృద్ధిపై చూపాలని మాజీ మంతి గొల్లపల్లి సూర్యారావు హితవు పలికారు. అంతర్వేదిలో పార్టీ రూపొందించిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను రాజోలు నియోజకవర్గ పరిశీలకులు కర్రి పాపారాయుడుతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ అధ్యక్షతన, నియోజకవర్గ ప్రచార విభాగం అధ్యక్షుడు నక్క రామారావు ఇంటి వద్ద జరిగిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అంతర్వేది దేవస్థానం గ్రామంలో తాగునీటి చెరువును సుమారు రూ.18 కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. అంతే కాకుండా గత ప్రభుత్వ హయాంలో గ్రామంలో కోట్ల రూపాయలతో పలు రకాల అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేసుకోవాలన్నారు. కార్యకర్తల ఇబ్బందులు ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి ఆయన డిజిటల్ బుక్‌ను మనకు అందించారన్నారు. పరిశీలకులు పాపారాయుడు మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీ పేద, బడుగు, బలహీన వర్గాల పక్షాన పోరాడే పార్టీ అని, కష్టపడిన ప్రతి ఒక్కరికి పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. ముందుగా బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సభలో పార్టీ సీనియర్ నాయకుడు కెఎస్ఎన్ రాజు, రాష్ట్ర కార్యదర్శి, కొత్తపేట నియోజకవర్గ పరిశీలకులు పాటి శివకుమార్, మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ గ్రామ కమిటీని సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ రాజోలు అధ్యక్షుడు కట్టా శ్రీనివాస్, సర్పంచ్ కొండా జాన్‌బాబు, కొల్లాబత్తుల నాని, జెడ్పీటీసీలు బల్ల ప్రసన్నకుమారి (మలికిపురం), మట్టా శైలజ (రాజోలు), మాజీ ఏఎంసీ రోజారమణి, పార్టీ రాష్ట్ర నాయకులు రుద్రరాజు చిన్నరాజా, తెన్నేటి కిషోర్, కటకంశెట్టి ఆదిత్య, తాడి సహదేవ్, జిల్లెళ్ల ఉదయ్ కిరణ్, నేతలు నాని, తోటే జాన్ బాబు, ఉచ్చుల విష్ణు, మోకా సురేష్, కొల్లాబత్తుల సతీష్, ఉచ్చుల దాసు, శ్రీకాంత్, అంతర్వేది దేవస్థానం గ్రామశాఖ అధ్యక్షుడు గునిశెట్టి వాసు, కార్యదర్శి నల్లి ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్



పి.గన్నవరంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు

పి.గన్నవరం: కూటమి పాలనలో వేధింపులకు, అన్యాయానికి గురవుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తల కోసం మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన డిజిటల్ బుక్ శ్రీరామ రక్షలా నిలుస్తుందని నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్ అధ్యక్షతన ఆదివారం జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులపై కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వేధింపులకు గురి చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటి నుంచి పార్టీ శ్రేణులను కాపాడుకునేందుకు జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను ప్రారంభించారన్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి కార్యకర్తలు తమ ఇబ్బందులను తెలియజేస్తే పార్టీ వారికి అండగా ఉంటుందని వివరించారు. జగన్‌ను మళ్లీ సీఎంను చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు పి.కె.రావు, మందపాటి కిరణ్‌కుమార్, జక్కంపూడి వాసు, తోరం గౌతమ్, దొమ్మేటి సత్యమోహన్, మిండగుదటి శిరీష్, పార్టీ నాయకులు మద్దుల వరలక్ష్మి, కొల్లే సూర్యనారాయణ, తులా గోపాలకృష్ణ, కాండ్రేగుల బాబీ, రాణి శ్రీధర్, దాసరి కాశీ, బొక్కా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి



పి.గన్నవరంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాసరావు, రాజేశ్వరిదేవి

పి.గన్నవరం: దేవాలయంగా భావించే అసెంబ్లీలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక మూడు రోడ్ల సెంటర్‌లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ, సభా సంప్రదాయాలను గౌరవించకుండా కళ్లజోడు నెత్తిపై పెట్టుకొని, జేబులో చేతులు పెట్టుకొని అసెంబ్లీలో బాలకృష్ణ వికృత చేష్టలు ప్రదర్శించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలకృష్ణ అసెంబ్లీ వేదికగానే జగన్‌కు క్షమాపణ చెప్పాలన్నారు. లేకపోతే ఉద్యమం తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. బాలకృష్ణను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయాలని, సభ్యత్వాన్ని రద్దు చేయాలన్నారు. బాలకృష్ణ వైఖరిని మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి తీవ్రంగా ఖండించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మండల శాఖ అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్, సీనియర్ నాయకులు మందపాటి కిరణ్‌కుమార్, జక్కంపూడి వాసు, పుచ్చకాయల నరసింహమూర్తి, మెల్లం మహాలక్ష్మి ప్రసాద్, ఎన్.దుర్గాప్రసాద్, పేరిచర్ల కుమార్‌రాజు, ఎన్.యువరాజు, తాటికాయల మధు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు సత్కారం

ఆలమూరు: మండలంలోని ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో విజేతలై నిలిచి ఉపాధ్యాయ నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులకు ఆదివారం ఘన సత్కారం జరిగింది. శ్రీకృష్ణదేవ రాయ కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు ఆధ్వర్యంలో సహచర సభ్యుల బృందం ఐదుగురిని ఘనంగా సత్కరించింది. అందులో కాబోయే ఉపాధ్యాయులైన పినపళ్ల గ్రామ సచివాలయంలో మహిళ పోలీసుగా పనిచేస్తున్న కొమ్మిశెట్టి నారాయణమ్మ (సంధిపూడి), మడికికి చెందిన అక్కా, తమ్ముడు సలాది నాగకృష్ణవేణి, మురళీ, చొప్పెల్లలో పోతుల తనూజ, అన్నెం సంతోషిమాత సత్కరించిన వారిలో ఉన్నారు. ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ రామానుజుల శేష గిరిరావు, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు శిరిగినీడి పట్టాభి తదితరులు పాల్గొన్నారు.